

21 వరకు ఓపెన్ స్కూల్ పరీక్షా ఫీజుకు గడువు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5: ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొందిన అభ్యాసకులు ఈ నెల 21 లోగా పరీక్షా ఫీజు చెల్లించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ లేదా మీసేవ ద్వారా మాత్రమే పరీక్షా ఫీజును చెల్లించాలని సూచించారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరుకానివారు, ఫెయిలైనవారు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు కోఆర్డినేటర్ వెంకటస్వామిని 8008403635 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



హత్నూర మండలం గుండ్లమాచ్నూర్ శివారులో అక్రమ క్వారీ

మనీ.. మైనింగ్!



కంది మండలం ఎర్దనూర్ తండా శివారులో మైనింగ్

సంగారెడ్డి జిల్లాలో అక్రమ క్వారీలు?

- అనుమతి లేనివి ఎన్నో?
- ఎక్కువగా బీఆర్ఎస్ నేతలవే!
- సర్కారు సీరియస్
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు.. తనిఖీలు
- అటవీ భూములను ఆక్రమించిన ప్రజాప్రతినిధి
- లక్డారంలో ఎమ్మెల్యే సోదరుడి క్వారీ సీజ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 5: సంగారెడ్డి జిల్లాలో మైనింగ్ అక్రమాలపై సర్కారు సీరియస్ అయ్యింది. బీఆర్ఎస్ పాలనలో మైనింగ్ అక్రమాలతో కోట్లాది రూపాయలు సంపాదించిన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులనే లక్ష్యం చేసుకుని పావులు కదుపుతున్నది. జిల్లాకు చెందిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. టాస్క్‌ఫోర్స్‌లో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తమరెడ్డి నాయకత్వంలో మైనింగ్, కాలుష్య నియంత్రణ మండలి, ఇరిగేషన్, రెవిన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం నాలుగైదు రోజులుగా జిల్లాలో.. ముఖ్యంగా పటాన్‌చెరు మండలంలోని క్వారీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నది. క్వారీలు నిర్వహిస్తున్నవారు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతి తీసుకున్నారా? ఏ భూమిలో మైనింగ్ చేస్తామని క్లియరెన్స్ పొందారు? మైనింగ్ వల్ల చుట్టుపక్కల ఉన్న చెరువులకు నష్టం జరుగుతుందా? ఎక్కడైనా చెరువుల్లో మైనింగ్ చేస్తున్నారా? తదితర అంశాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలిస్తున్నారు.

నేతల ఆధ్వర్యంలోనే క్వారీలు

పటాన్‌చెరు మండలం లక్డారం, చిట్కుల, చిన్నకంజర్ల, కంది మండలం ఎర్దనూర్, ఎర్దనూర్ తండా, బ్యాతోల్, ఆరుట్ల, హత్నూర మండలం గుండ్లమాచ్నూర్ తదితర ప్రాంతాల్లో పలువురు నాయకులు మైనింగ్ అనుమతి తీసుకుని క్వారీలు నిర్వహిస్తున్నారు. వీరిలో ఎక్కువగా బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులే ఉన్నారు. లక్డారం, గుండ్లమాచనూర్ ప్రాంతాల్లో పటాన్‌చెరు ప్రాంత బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి ఒకరు క్వారీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ క్వారీలను నిర్వహిస్తున్నా గతంలో జిల్లా యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడలేకపోయింది.

కాలుష్య కోరల్లో గ్రామాలు

అక్రమ మైనింగ్ కారణంగా చుట్టుపక్కల గ్రామాలు కాలుష్యం బారినపడుతున్నాయి. క్వారీలో భారీ పేలుళ్ల కారణంగా చుట్టూ ఉన్న గ్రామాలపై దుమ్ము తెరలు కమ్ముకుంటున్నాయి. గాలిని సైతం పీల్చలేని పరిస్థితి నెలకొన్నది. ఇలా కాలుష్యానికి కారణమవుతున్నారని పేర్కొంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే జి.మహిపాల్‌రెడ్డి సోదరుడు, బీఆర్ఎస్ నాయకుడు జి.మధుసూదన్‌రెడ్డి నిర్వహిస్తున్న సంతోష్ సాండ్, గ్రానేట్ సప్లై క్వారీని రెండ్రోజుల క్రితం అధికారులు సీజ్ చేశారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధలకు విరుద్ధంగా ఈ క్వారీ కొనసాగుతున్నదని అధికారులు పేర్కొన్నారు. ఈ క్వారీనీ మూసేయాలని గతేడాది మార్చి 10న కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ఉత్తర్వులు సంవత్సరం అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే అమలు కావడం విశేషం.

అటవీ భూమి ఆక్రమణ

హత్నూర మండలం గుండ్లమాచ్నూర్ శివారులోని కోట్ల రూపాయల విలువైన సుమారు 15 ఎకరాల అటవీభూమిని ఆక్రమించుకుని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి ఒకరు క్వారీ నిర్వహిస్తున్నారు. అటవీశాఖ భూమి ఆక్రమణకు గురైందని సదరు క్వారీ నిర్వహకుడిపై అధికారులు ఫిర్యాదు చేసినా గతంలో జిల్లా యంత్రాంగం పట్టించుకోలేదు. క్వారీ నిర్వహణ వల్ల సమీపంలోని వ్యవసాయ భూమి కూడా పనికి రాకుండా పోయింది. క్వారీలో పేలుళ్ల కారణంగా బండరాళ్లు సమీపంలోని వ్యవసాయ భూమిలో పడుతున్నాయని రైతులు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల రైతులు పొలాలకు వెళ్లేందుకు భయపడి సాగు మానుకున్నారు. క్వారీ నిర్వహకుడైన ప్రజాప్రతినిధిని ఎదురించలేక వ్యవసాయ భూమిని బీడుగా ఉంచాల్సి వస్తున్నదని రైతులు తూర్పాటి యాదయ్య, బద్రేశ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అటవీ భూమిని ఆక్రమించినా, రైతులు పంట పొలాలు బీళ్లుగా మారినా ఇంకా టాస్క్‌ఫోర్స్ దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఒక చోట అనుమతులు తీసుకుని మరో చోట లేదా అనుమతులకు మించి తవ్వకాలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.



ఎర్దనూర్ తండా శివారులో స్టోన్ క్రషర్

రేపటి నుంచి జీపీ ప్రత్యేక కార్యక్రమాలు

- తాగునీరు, పారిశుధ్యం, పన్నుల వసూలుపై దృష్టి
- మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీల అభివృద్ధికి స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన దిశానిర్దేశం చేశారు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు ఈ నెల 2 నుంచి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతీ ఇంటికి తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, నిత్యం పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాలని సూచించారు. హరితహారం మొక్కలను సంరక్షించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన అవసరం

విపత్తుల నిర్వహణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జాతీయ విపత్తుల నిర్వహణ రెస్పాన్స్ ఫోర్స్ అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నేటి నుంచి ఈ నెల 21 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

పకడ్బందీగా ఈవీఎంల తనిఖీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5: జిల్లాకు కేటాయించిన ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ పకడ్బందీగా చేపట్టాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని గోడౌన్‌లో గుర్తింపుపొందిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సోమవారం స్ట్రాంగ్‌రూంలు తెరిచి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను ప్రారంభించారు. ఈసీఐఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి కలెక్టర్ ఈవీఎంలను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించిన 1,197 బ్యాలెట్ యూనిట్లు, 947 కంట్రోల్ యూనిట్లు, 911 వీవీ ప్యాట్‌లను నిపుణుల బృందం పది రోజులపాటు క్షుణ్ణంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.



ఈవీఎంల తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



మెదక్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు
- కలెక్టరేట్‌లకు జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారులు

7లో

నేటి నుంచి సర్కారు బడులకు పరిశీలన బృందాలు

- పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన
- సంగారెడ్డి జిల్లాలో 82 బృందాలు ఏర్పాటు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5: జిల్లాలోని సర్కారు బడులకు పరిశీలన బృందాలు రానున్నాయి. పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల నమోదు ప్రక్రియలో ఏ విధమైన పారదర్శకతను పాటించారనే విషయాన్ని పరిశీలించనున్నాయి. ఇందుకోసం సంగారెడ్డి జిల్లాలో 82 బృందాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ప్రతీ బృందంలో ప్రధానోపాధ్యాయుడు, లాంగ్వేజ్ టీచర్, నాన్ లాంగ్వేజ్ టీచర్ సభ్యులుగా ఉంటారు. ఈ బృందాలు నేటి నుంచి 10 వ తేదీ వరకు ప్రతీ రోజు రెండు పాఠశాలల చొప్పున తనిఖీ చేసి, 12వ తేదీ లోగా జిల్లా విద్యాశాఖకు పూర్తి నివేదిక సమర్పించనున్నాయి. పదో తరగతి వార్షిక పరీక్షను 80 మార్కులకు నిర్వహించగా, మిగిలిన 20 ఇంటర్నల్ మార్కులను సీసీఈ విధానంలో కేటాయిస్తారు. ఇంటర్నల్ మార్కుల నమోదు ప్రక్రియ పాఠశాల స్థాయిలో జరుగుతుంది. ఈ మార్కులు ఏ విధంగా నమోదు చేశారనే విషయాలను విద్యాశాఖ నియమించిన ప్రత్యేక బృందాలు పరిశీలిస్తాయి. ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో వాస్తవ మార్కులు వేశారా, ఇష్టారీతిన నమోదు చేశారా అనే విషయాలను బృందాలు క్షుణంగా పరిశీలించి జేరీజు వేస్తాయి. లోపాలుంటే వాటిని సరిచేసిన తర్వాతే మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

బడి ఆవరణలో పార్కింగా?

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి ఆగ్రహం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాల ఆవరణను ప్రైవేటు వ్యక్తులు వాహనాల పార్కింగ్ కోసం వాడుకోవడంపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి పట్టణంలో ఓ స్కూల్‌లో ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేయడంపై 'ప్రభుత్వ పాఠశాలా? పార్కింగ్ స్థలమా?' అనే శీర్షికన ఈ నెల 4న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. స్కూల్‌లో పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని, ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లును ఆదేశించారు. ఈమేరకు సంగారెడ్డి ఎంఈవో వెంకటనర్సింహులు సోమవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపి డీఈవోకు నివేదిక అందజేశారు.

పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి

- శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర కీలకం
- మెదక్ ఎస్పీ డా.బాలస్వామి
- ముగిసిన సాయుధ బలగాల శిక్షణ

7లో

221.4 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

7లో

సదాశివపేట బల్దియాలో క్యాంపు రాజకీయం

విహారయాత్రకు 22 మంది కౌన్సిలర్లు

- అన్ని పార్టీల వారితో కలిసి వెళ్లిన బీఆర్ఎస్ నేత
- కాంగ్రెస్ మద్దతుతో తన సతీమణికి చైర్మన్‌గిరి!
- కాంగ్రెస్ గూటికి చేరతారని ప్రచారం



క్యాంపునకు బయలుదేరుతున్న సదాశివపేట మున్సిపల్ కౌన్సిలర్లు

సదాశివపేట, ఫిబ్రవరి 5: సదాశివపేట మున్సిపాలిటీలో రాజకీయాలు పక్క రాష్ట్రాలకు చేరుకున్నాయి! చైర్‌పర్సన్‌పై ఇచ్చిన అవిశ్వాసం నోటీసులపై ఓటింగ్ నిర్వహించేందుకు ఈ నెల 9వ మున్సిపల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 22 మంది కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. మున్సిపాలిటీలో 26 వార్డులుండగా.. బల్దియా పీఠం ప్రస్తుతం బీఆర్ఎస్ చేతిలో ఉన్నది. కానీ అదే పార్టీకి చెందిన నాయకుడే ప్రస్తుత చైర్‌పర్సన్‌ను గద్దె దింపాలని కసరత్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ.. బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం కౌన్సిలర్లతో కలిసి ఆయన అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ఆ నాయకుడు తన సతీమణిని మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానంలో కూర్చోబెట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. తొలుత టీడీపీలో ఉన్న సదరు నేత అక్కడి నుంచి కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీల్లో కొనసాగి.. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో చేరడం గమనార్హం. కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నేత ఆశీస్సులతోనే ఆయన ముందుకు వెళ్తున్నారని, అన్ని పార్టీల కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్‌గిరిని దక్కించుకున్న అనంతరం ఆయన కాంగ్రెస్ గూటికి చేరతారని ప్రచారం జరుగుతున్నది.

అగ్ర నాయకత్వంపైనే బీఆర్ఎస్ ఆశలు

బీఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లడంపై ప్రస్తుత చైర్‌పర్సన్ వర్గం ఆగ్రహంతో ఉన్నది. పదవీకాంక్షతో పార్టీలన్నీ తిరుగుతున్న నేతకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మద్దతు తెలపడం ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీతో బీఆర్ఎస్‌ను గెలిపించుకున్నా బల్దియా పీఠం కోల్పోతుండడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్దియా పీఠం చేజారకుండా రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. లేదంటే ఈ ప్రభావం పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై పడుతుందని హెచ్చరిస్తున్నారు.

పార్టీ పరువు తీయొద్దు

బీఆర్ఎస్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే 'చింతా' సమావేశం

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 5: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. కౌన్సిలర్లు ఒక్కొక్కరితో ఆయన విడివిడిగా మాట్లాడి అభిప్రాయాలు తీసుకున్నట్టు తెలిసింది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసం పెడితే బీఆర్ఎస్‌కు చెందినవారినే ఎన్నుకోవాలని ఆయన సూచించినట్టు సమాచారం పార్టీ పరువు తమ తీయవద్దని హితవు పలికినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లతా విజయేందర్‌రెడ్డితో పాటు ఇద్దరు కౌన్సిలర్లు గైర్హాజరైనట్టు తెలిసింది.

వెనక్కితగ్గిన పలువురు..

సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస నోటీసులపై సంతకాల చేసిన కౌన్సిలర్లలో ఒక్కొక్కరుగా వెనక్కి తగ్గుతున్నట్లు తెలిసింది. అవిశ్వాసంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీలకు చెందిన 22 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన విషయం తెలిసిందే. వీరిలో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు యూటర్న్ తీసుకున్నట్లు సమాచారం.



నారాయణఖేడ్ నుంచి పండరీపూర్‌కు బయలుదేరిన మాఘవారి దిండియాత్ర

విఠలా.. హరి విఠలా..

- నారాయణఖేడ్ నుంచి పండరీపూర్‌కు మాఘవారి దిండియాత్ర

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5: మహారాష్ట్రలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన పండరీపూర్‌కు మాఘవారి దిండి యాత్ర సోమవారం నారాయణఖేడ్ నుంచి ప్రారంభమైంది. అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతి మహరాజ్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు తలపై కళశం, తులసీ కోట ధరించి, విఠలా.. పాండురంగా అంటూ భజనలు చేస్తూ దిండియాత్రకు బయలుదేరారు. ఏకాంబ పీఠం నుంచి 102 సంవత్సరాలుగా దిండియాత్ర కొనసాగుతుండగా.. నారాయణఖేడ్‌లో 26 ఏళ్లుగా యాత్ర నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు 30 కిలోమీటర్ల చొప్పున 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న పండరీపూర్‌కు యాత్రికులు 10 రోజుల్లో చేరుకుంటారు. ఖేడ్‌లో దిండియాత్ర ప్రారంభోత్సవానికి ఏకాంబ పీఠాధిపతి అవధూత్ మహరాజ్ హజరయ్యారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఆనంద్ స్వరూప్ షెట్కార్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, పండరిరెడ్డి, వివేకానంద్, దారం శంకర్, చందర్‌పటేల్, రమణరెడ్డి, మూడ లక్ష్మణ్, నారాయణ, నర్సింహులు, విఠల్, బాలాజీ, జైపాల్ రెడ్డి స్వాగతం పలికారు.

సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన

పుల్‌కల్, ఫిబ్రవరి 5: పుల్‌కల్ మండల పరిధి బస్వాపూర్ గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా లేకపోవడంతో, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా వచ్చి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామంటూ మొండికేశారు. సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్నిసార్లు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పట్టించుకోని ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలంటూ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు నినాదాలు చేశారు. పక్షం రోజుల్లోగా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేలా చూస్తానని ప్రిన్సిపాల్ జ్యోతి హెబ్సీబా హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

రెండో వివాహం చేసుకున్న యువకుడిపై కేసు

తూప్రాన్, ఫిబ్రవరి 5: వివాహం చేసుకుని వరకట్నం కోసం వేధింపులకు గురి చేయడమే కాకుండా, మరో యువతిని పెళ్లి చేసుకున్న యువకుడిపై, కుటుంబీకులపై, మధ్యవర్తులపై కేసు నమోదైంది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. తూప్రాన్ పట్టణానికి చెందిన మోయినొద్దీన్ కామారెడ్డిలో ఇంటెలిజెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. అతని కుమారుడు ఇమ్రాన్‌ఖాన్ (31)కి హవేలీఘనపూర్ మండల కేంద్రానికి చెందిన షబానతో 2019లో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు జన్మించింది. 2020 డిసెంబర్ 21న భర్త ఇమ్రాన్, అత్తమామలు శారీరకంగా, మానసికంగా వేధించి ఇంట్లో నుంచి ఆమెను బయటకు పంపించారు. పలుమార్లు పంచాయితీలు నిర్వహించినా మార్పు రాకపోవడంతో 2022 మార్చి 19న హవేలీఘనపూర్ పోలీస్‌స్టేషన్‌లో వారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. సోమవారం తూప్రాన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో మనోహరాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ఇమ్రాన్‌కు వివాహం జరిపించారు. ఈ విషయం తెలుసుకున్న భార్య షబాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

జహీరాబాద్, ఫిబ్రవరి 5: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో విద్యార్థి మృతిచెందాడు. ఈ ప్రమాదం పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. రాంనగర్‌కు చెందిన ఈష్టే శ్రీకాంత్(17) ఝరాసంగం వెళ్లే రోడ్డులోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఉదయం కళాశాలకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. జహీరాబాద్ డిపోకు చెందిన బస్సు వెనక నుంచి వస్తున్నది. ఇది గమనించని శ్రీకాంత్ కళాశాల వైపు బైక్‌ను అకస్మాత్తుగా తిప్పడంతో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు బలమైన గాయాలు కావడంతో జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గాయాలు.. లైన్‌మన్ మృతి

చేగుంట, ఫిబ్రవరి 5: విద్యుదాఘాతంలో గాయపడిన లైన్‌మన్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట మండలం చిన్నశివనూర్ గ్రామంలోని నార్సింగి గ్రామానికి చెందిన దాయం కృష్ణ(51) గ్రామ శివారులో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆర్బిట్ ఇన్సులేటర్ పరిశ్రమలో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా షాక్‌కు గురై కిందపడిపోయాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ఐ హరీశ్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'సంస్కార్' విద్యార్థులు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 5: సంగారెడ్డిలోని విశ్వా ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జోనల్ లెవల్ మెదక్ ఉమ్మడి జిలా అబాకస్, వేదిక్ మ్యాస్ పోటీల్లో పెద్దశంకరంపేటకు చెందిన సంస్కార్ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ సీతారామారావు సోమవారం తెలిపారు. విద్యాలయం నుంచి 14 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, అబాకస్ విభాగంలో నాలుగో తరగతి చదువుతున్న అంబటి కౌశిక్ మొదటిస్థానం, వేదిక్ మ్యాస్‌లో ఏడో తరగతి చదువుతున్న రాగం సుదీక్ష ద్వితీయస్థానంలో నిలిచారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

షాపింగ్ కాంప్లెక్స్ పేరిట డబ్బులు వసూలు

● మున్సిపల్ చైర్మన్, కమిషనర్లపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు



మెదక్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్, ఫిబ్రవరి 5: మెదక్ పట్టణంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం షాపులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్, కమిషనర్ రూ. 4లక్షల 82వేలు డీడీల రూపంలో వసూలు చేశారని ఎమ్మార్పీఎస్, దళిత సంఘ నేతలు బాల్‌రాజ్, రాజు, రాజస్వామిలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. షాపుల కేటాయింపులో జాప్యమెందుకు జరుగుతున్నదని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్ జానకిరామ్ సాగర్లను ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆరోపించారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

మెదక్ రీజియన్‌కు ఆర్టీసీ కొత్త బస్సులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 : ఆర్టీసీ మెదక్ రీజియన్‌కు ప్రభుత్వం కొత్త బస్సులను కేటాయించింది. ఇప్పటివరకు తొమ్మిది కొత్త బస్సులు రీజియన్‌లోని వివిధ డిపోలకు కేటాయించినట్లు రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని బస్సులు కొత్తవి రానున్నట్లు ఆమె పేర్కొన్నారు. అయితే రీజియన్‌కు వచ్చిన కొత్త బస్సులను త్వరలోనే జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



కట్కూరులో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంట

పొద్దు తిరిగింది.. బతుకు మారింది..!

- కట్కూరులో పొద్దుతిరుగుడు సాగు
- ఒకే గ్రామంలో 410 ఎకరాల్లో పంట
- తక్కువ పెట్టుబడి.. లాభాలు అధికం
- ఆసక్తి చూపిస్తున్న మిగతా రైతులు

అక్కన్నపేట, ఫిబ్రవరి 5: పొద్దుతిరుగుడు పంటకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. అక్కన్నపేట మండలంలోని కట్కూరు గ్రామంలో 40 ఏళ్ల క్రితం పొద్దుతిరుగుడు పంటను ఎక్కువగా సాగు చేసేవారు. పక్షుల బెడద ఎక్కువ కావడంతో క్రమంగా ఈ పంటకు దూరమయ్యారు. దీనికి బదులుగా వరి, పత్తి, పంటల సాగు వైపు మొగ్గుచూపారు. అయితే చీడపీడలతో ఈ పంటల్లో రైతులకు నష్టాలే మిగులుతూ వచ్చాయి. అందులోనూ మెట్టప్రాంతం కావడంతో సరిపడా నీరు లేక సతమతమయ్యారు. అయితే పొద్దుతిరుగుడుకు డిమాండ్ ఉండడంతో ఏడేళ్ల క్రితం గ్రామంలోని రైతులు మళ్లీ సన్‌ఫ్లవర్ సాగువైపు మొగ్గు చూపారు. గ్రామ పరిధిలో 4 వేల ఎకరాల్లో సాగు భూమి ఉండగా రబీలో 2500 ఎకరాల్లోనే పంటలు వేశారు. అందులో 410 ఎకరాల్లో 204 మంది రైతులు ప్రస్తుతం ఈ పొద్దుతిరుగుడు పంటను సాగు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఒకే గ్రామంలో ఇంత మొత్తంలో పొద్దుతిరుగుడు పంటను కట్కూరు గ్రామానికి చెందిన రైతులే సాగు చేయడం విశేషం.

తక్కువ పెట్టుబడి.. తక్కువ నీరు

పొద్దుతిరుగుడు పంట సాగు చేయడానికి తక్కువ నీరు అవసరం ఉంటుంది. దాదాపు 15 రోజులకు ఒక సారి పంటకు నీటి తడిని అందిస్తే సరిపోతుంది. ఎకరానికి సుమారుగా రూ.10 వేలు ఖర్చు పెడితే 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తున్నది. గత సంవత్సరం పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర రూ.6400 దక్కింది. ఇలా కట్కూరు గ్రామ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందుతున్నారు.

ఒక్కరిని చూసి మరొకరం



తక్కువ నీరు, పెట్టుబడి కూడా తక్కువే కావడంతో పాటు దిగుబడి ఎక్కువగా వస్తుండడంతో మా గ్రామంలో ఒక్కరిని చూసి మరొకరం పొద్దుతిరుగుడు పంటను సాగు చేస్తున్నాం. చీడపీడలు, అకాల వర్షాల వల్ల పొద్దుతిరుగుడు పంటకు ఎలాంటి నష్టం లేకపోవడంతో మా ఊరిలో రైతులు ఎక్కువగా ఈ పంట వైపే మొగ్గు చూపుతున్నారు.

- అన్నారపు దూలయ్య, రైతు, కట్కూరు

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



హుస్నాబాద్ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో సిద్దిపేట మార్కెట్‌కు వెళ్లవలసి వస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి హుస్నాబాద్‌లోనే పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- యాదిరెడ్డి, రైతు, కట్కూరు

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



పశువులు, పక్షుల నుంచి పంటను రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పంటకు ఏదైనా వ్యాధులు సంక్రమిస్తే వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చు.

-పి.ఐశ్వర్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు
- కలెక్టరేట్‌లకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మొత్తం 98 దరఖాస్తులు రాగా అందులో భూ సమస్యలు 52, జనరల్ 25, పింఛన్లు 13, ఉపాధిపై 8 వినతులు వచ్చాయి. బాధితుల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమ ఎస్పీ బాలస్వామి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

సంగారెడ్డి గ్రీవెన్స్‌కు 75 అర్జీలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 5 : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తదమ సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో


సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో సిర్గాపూర్ మండలం గౌడ్‌గామ్ గ్రామంలో ప్రభుత్వం తమకు గృహనిర్మాణాల నిమిత్తం 38 మందికి పట్టాలిచ్చారని తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బిరాదర్ మారుతప్ప వారి కుమారులు దౌర్జన్యం చేసి తనను బెదిరించి భూమిని కబ్జాచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి పండరి తనకు సంగారెడ్డి జిల్లా కోర్టులో అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చినా అధికారులు తనను తీసుకోవడం లేదని, ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని అర్జీలో కోరారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించి 25 అర్జీలు రాగా, పింఛన్ ఇప్పించాలని, ఉపాధి చూపాలని వివిధ శాఖలకు సంబంధించి 50 అర్జీలు, మొత్తం 75 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 : ప్రజావాణికి వచ్చిన బాధితులకు న్యాయం చేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆమె దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి గొప్ప కార్యక్రమని, సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోడానికి చక్కని వేదిక అని తెలిపారు. ప్రజావాణికి తప్పనిసరిగా అధికారులు హాజరుకావాలని ఆమె ఆదేశించారు. భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 28 దరఖాస్తులు వచ్చాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామం శివారులో నిర్మించనున్న ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని ఆ గ్రామ ప్రజలు ప్రజవాణిలో ఫిర్యాదు చేశారు.

పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి

- ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర చాలా కీలకం
- మెదక్ ఎస్పీ డా.బాలస్వామి
- ముగిసిన సాయుధ బలగాల శిక్షణ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5 : పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదని, ఎప్పుడూ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ పరేడ్‌గ్రౌండ్‌లో సాయుధ బలగాలకు పదిహేను రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణలో పరేడ్, లాఠీడ్రిల్, మాబ్ ఆపరేషన్, ఆయుధాల వినియోగం, ఫైరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాలుగు ప్లాటూన్లతో కూడిన పరేడ్ నిర్వహించారు. కమాండెడ్‌గా ఆర్ఐ అచ్యుత్‌రావు వ్యవహరించారు. శిక్షణలో ప్రతిభ చూపిన వివిధ విభాగాల సిబ్బందికి ఎస్పీ బాలస్వామి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏడాది ఒకసారి శిక్షణ కార్యక్రమం నిర్వహించుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ఎంతగానో కృషి చేస్తారన్నారు. వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుకోవాలన్నారు. అనంతరం జిల్లా సాయుధ విభాగంలోని పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో వారి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ శ్రీరంగానాయక్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలను అందజేసి అభినందిస్తున్న ఎస్పీ బాలస్వామి

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

- డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన జిల్లా స్థాయిలో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు ఈపోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 6న పాఠశాల స్థాయిలో, 7న మండలస్థాయిలో, 9వ తేదీన జిల్లాస్థాయిలో జిల్లా సైన్స్ కేంద్రంలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విభాగం నుంచి ముగ్గురు చొప్పున ఉత్తమ స్థానాలు పొందిన 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. వారికి ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సైన్స్ అధికారి 6302290235 నంబరును సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఐదు ప్రాజెక్టులు ఎంపిక

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5 : రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆదేశాల మేరకు వర్చువల్ పద్ధతిలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఐదు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. బంజారానగర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అభిలాష్‌గౌడ్ రూపొందించిన కదిలె బహుళార్థక సాధక నిచ్చెన, తూప్రాన్ కేజీబీవీకి చెందిన ఇద్దరు విద్యార్థులు జన్నా శ్రావణి మత్తు పదార్థాలను గుర్తించే ఇండికేటర్, ప్రణతి రూపొందించిన స్మార్ట్ స్కూల్ బ్యాగ్, టేక్మాల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విష్ణునాయక్ తయారు చేసిన వ్యర్థ ప్లాస్టిక్ నుంచి ఇటుకల తయారీ, పాపన్నపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విష్ణువర్ధన్ రూపొందించిన దొంగతనం చేయడానికి వీలుకాని ఏటీఎం యంత్రం ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.

221.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద లారీ స్వాధీనం


తూప్రాన్ వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

తూప్రాన్, ఫిబ్రవరి 5 : భారీ ఎత్తున రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసు, సివిల్ సప్లయ్ అధికారులు మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం, సివిల్ సప్లయ్ అధికారుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కాటేదాన్ నుంచి మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ శివానందం, పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ సాదిక్ ఆధ్వర్యంలో తూప్రాన్ టోల్‌ప్లాజ్ వద్ద కాపుకాశారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్(పీడీఎస్) బియ్యం లారీని పట్టుకున్నారు. 221.40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీడ్రైవర్ సలీమ్ మియాను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. కాటేదాన్ నుంచి నార్సింగి మండల కేంద్రానికి చెందిన బాబిసెట్ అలియాస్ శ్రావణ్‌కుమార్‌కు ఈ బియ్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ సలీం మియా, లారీ యజమాని ఖాన్‌సాబ్, కాటేదాన్ నుంచి బియ్యం పంపిస్తున్న వాజిద్‌అలీ, నార్సింగికి చెందిన బియ్యం కొనుగోలుదారు బాబీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వానికి సీఎస్ఆర్ కింద అందజేసేందుకు ఈ బియ్యం కొనుగోలు చేసినట్టు తెలిసింది.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు

- ఆగ్రహంతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థినీ కుటుంబీకులు


ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగుతున్న విద్యార్థినీ కుటుంబీకులు, గ్రామస్థులు

నంగునూరు, ఫిబ్రవరి 5 : విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా నంగునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు తిరుపతి అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినితో కొన్నిరోజుల నుంచి అసభ్యంగా ప్రవర్తిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే శనివారం ల్యాబ్ రూమ్‌కు రమ్మని అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు విద్యార్థిని ఈ విషయాన్ని క్లాస్ టీచర్‌తో పాటు తన కుటుంబీకులకు తెలిపింది. దీంతో వారు సోమవారం గ్రామస్థులతో కలిసి పాఠశాలకు వెళ్లారు. ఈ క్రమంలో పాఠశాలలో జరిగిన విషయంపై ఉపాధ్యాయులతో ఆరా తీస్తుండగా మధ్యలో వచ్చిన వంశీకృష్ణ అనే ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి దిగారు. ఈ తంగాన్ని గమనించిన సదరు ఉపాధ్యాయుడు తిరుపతి తప్పించుకున్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. అలాగే ఎంఈవో దేశిరెడ్డి స్థానిక నాయకులు అంతా కలిసి సదరు ఉపాధ్యాయుడితో క్షమాపణ చెప్పించారు. దాంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం గ్రామస్థులు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా స్థానిక నాయకులు జోక్యం చేసుకొని ఇరువర్గాల మధ్య రాజీ కుదిరించినట్లు సమాచారం.

సూపర్ స్టూడెంట్‌గా గురుకుల విద్యార్థి ఎంపిక

చేగుంట, ఫిబ్రవరి 5 : చేగుంట మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల క్రీడాపాఠశాల విద్యార్థిని రీజినల్ స్థాయిలో సూపర్ స్టూడెంట్‌గా ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అర్పిత రీజినల్ లెవెల్‌లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. సూపర్ స్టూడెంట్‌గా ఎంపికైన అర్పితకు రూ.1500 నగదు, ప్రశంసాపత్రాన్ని అందించినట్లు తెలిపారు. అర్పితను తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకులాల సంస్థ డిప్యూటీ సెక్రటరీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఓఎస్డీలు శ్రీనివాకుమార్, సుమలత అభినందించారు.


అర్పితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధికారులు


ఆధార్ అప్‌డేట్ కోసం పాట్లు

నారాయణఖేడ్ నియోజకవర్గవ్యాప్తంగా ఖేడ్ మున్సిపాలిటీ, ఎంపీపీ కార్యాలయం ఆవరణలోనే ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. ఆధార్ అప్‌డేట్ కోసం అన్ని మండలాల నుంచి వందలాది మంది వస్తుండడంతో జనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సోమవారం ఖేడ్‌లోని ఆధార్ కేంద్రాన్ని తెరువకముందే కేంద్రం ఎదుట ఆధార్‌కార్డులను, ధ్రువపత్రాలను వరుస క్రమంలో పెట్టారు.

- నారాయణఖేడ్, ఫిబ్రవరి 5



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు

● పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం, ఫిబ్రవరి 5: ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ సతీష్ అన్నారు. సోమవారం గడ్డపోతారంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిన్నారం, గుమ్మడిదల మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ, పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మకంగా మార్పులు చేపట్టామని, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో విద్యనందించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంఈవో జెమినికుమారి, నాయకులు ప్రకాశంచారి, వెంకటేశంగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సాహిత్య పోటీలకు ఎంపిక

పాపన్నపేట, ఫిబ్రవరి 5: తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య సంకీర్తనలు, సంగీత సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 26 వరకు తిరుపతిలో జరుగనున్న సాహిత్య పోటీలకు మండల పరిధిలోని యూసుఫ్‌పేటకు చెందిన ఉప్పరి భువనేశ్వర్ ఎంపికైనట్లు సోమవారం తెలిపారు. జనవరి 31న వరంగల్‌లో ఎంపికలు జరుగగా జిల్లా నుంచి పలువురు పాల్గొని ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు భువనేశ్వర్ పేర్కొన్నారు.

నిధుల కేటాయింపులో వివక్షపై కౌన్సిలర్ల ఆందోళన

● సమావేశం బహిష్కరణ ● బీఆర్‌ఎస్‌కు రాజీనామా.. నేడు కాంగ్రెస్‌లో చేరనున్న కౌన్సిలర్

జిన్నారం, ఫిబ్రవరి 5: బొల్లారం మున్సిపాలిటీలో నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి ఆందోళనకు దిగగా.. కౌన్సిలర్ చంద్రారెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతానని ప్రకటించారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్లుగా తమ వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదంటూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, జయమ్మ, సంధ్య నిహారిక, చంద్రయ్య, గోపాలమ్మ, కాంగ్రెస్‌కు చెందిన వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, సంతోష ఆందోళనకు దిగారు. ఇష్టారాజ్యంగా తమ అనుచరుల వార్డులలోనే నిధులు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశాన్ని బహిష్కరించి, నేలపై కూర్చొని ఆందోళన చేశారు. చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ వివక్ష చూపుతున్నారని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్ చంద్రారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత ఇవ్వడం లేదని వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి ఆరోపించారు.



బొల్లారం మున్సిపల్ సమావేశంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్‌కు రాజీనామా.. నేడు కాంగ్రెస్‌లో చేరిక

బొల్లారం మున్సిపాలిటీలో నిధుల కేటాయింపులో వివక్ష కారణంగా పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు కౌన్సిలర్ చంద్రారెడ్డి తెలిపారు. సమస్యలు, అభివృద్ధి పట్టని బీఆర్‌ఎస్‌లో కొనసాగలేనని, ఈనెల 6న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు చంద్రారెడ్డి తెలిపారు. కాగా ఆయనతో పాటు మరో నలుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

'గావ్ చలో అభియాన్'ను జయప్రదం చేయండి: విఠల్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 5: గావ్ చలో అభియాన్(పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆయా గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులతో గావ్ చలో అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో విద్యాశాఖ ఏఎస్‌పీడీ పర్యటన

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5: కొండాపూర్ మండలం మల్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏఎస్) పీడీ జీ.రమేశ్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలు, పదో తరగతి ప్రత్యేక తరగతులు, యూనిఫామ్స్ పంపిణీ, మనఊరు-మనబడి పనుల పురోగతి తదితర అంశాలపై ఆరాతీశారు. డిజిటల్ తరగతి గదులను పరిశీలించి ఐఎఫ్‌పీ ప్యానళ్లలో సాఫ్ట్‌వేర్ అప్‌లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లో లైబ్రరీ పుస్తకాల పంపిణీ ఆరా తీశారు. ఆయనవెంట డీఈవో వెంకటేశ్వర్లు, సీఎంవో వెంకటేశం, ఏఎంవో అనురాధ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



బోధన తీరును పరిశీలిస్తున్న ఏఎస్‌పీడీ రమేశ్, పక్కన డీఈవో వెంకటేశ్వర్లు



చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి, చందాపూర్, మల్లుపల్లి గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రం నుంచి జంగరాయికి వెళ్లే మట్టి దారుణంగా ఉన్నది. రోడ్డు మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేయడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- చిన్నశంకరంపేట

'ఖేలో ఇండియా' విజేతకు మంత్రి అభినందన

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 5: ఖేలో ఇండియాలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సోమవారం సంగారెడ్డిలోని తన నివాసంలో సన్మానించారు. ఖేలో ఇండియాలో కిక్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో లైట్ కాంటాక్ట్ ఫైట్ విభాగంలో వెండి పతకం సాధించిన సంగారెడ్డికి చెందిన విద్యార్థిని వర్షతో పాటు కోచ్ రమేష్‌లను మంత్రి అభినందించారు.

మెదక్ ఎంపీ అభ్యర్థిగా మద్దతివ్వండి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు బీరయ్యయాదవ్ వినతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 5: బీఆర్‌ఎస్ నుంచి తనకు మెదక్ ఎంపీ అభ్యర్థిగా మద్దతివ్వాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్యయాదవ్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతా ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తన మద్దతు ఇస్తామని హామీ ఇచ్చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని బీరయ్యయాదవ్ తెలిపారు.



'చింతా'కు వినతిపత్రం అందజేస్తున్న బీరయ్య

సమాచారం

'వినియోగదారుల ఫోరం సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

హవేళిఘణపూర్: ప్రజలు వినియోగదారుల ఫోరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లీగల్ సెల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు సిద్ధాగౌడ్ తెలిపారు. హవేళిఘణపూర్‌లోని పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు వినియోగదారుల ఫోరంపై అవగాహన కల్పించారు.

ఆటోడ్రైవర్ల, భవన నిర్మాణ కార్మిక చట్టం తేవాలి: సీఐటీయూ

నారాయణఖేడ్: ఆటోడ్రైవర్ల, భవన నిర్మాణ హమాలీ కార్మికులతో పాటు అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమాల మాణిక్ కోరారు. సోమవారం నారాయణఖేడ్‌లో ఆయా రంగాల కార్మికులతో మాట్లాడారు.

7 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

నారాయణఖేడ్: సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని తహసీల్ మైదానంలో 7 నుంచి బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, బాధ్యులు సోమవారం తెలిపారు. 6న డ్రా తీస్తామన్నారు. వివరాలకు 9848986050, 6302274966, 9705825227 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5: చిన్నశంకరంపేటకు చెందిన గజిబిన్‌కార్ ప్రభాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న బాధిత కుటుంబానికి సోమవారం డాక్టర్ శ్రీధర్ రాధిక డయోగ్నస్టిక్ ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

చేగుంట: చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో యువజన నాయకుడు డిష్ రాజు పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లను సోమవారం అందజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికులను పట్టించుకోరా?

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 5: విద్యార్థులకు అప్పులు చేసి భోజనాన్ని వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను పట్టించుకోరా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అధికారులను నిలదీశారు. సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఐదునెలలుగా వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గుడ్ల ధరను పెంచాలని, గుర్తింపు కార్డులు, వంట షెడ్లు, వంట పాత్రలు ప్రభుత్వమే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, లక్ష్మి, శంకరమ్మ, స్వరూప, చెందమ్మ, సాయమ్మ, పాల్గొన్నారు.

వాటర్ సప్లయ్ కార్మికుల బకాయి వేతనాలివ్వండి

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీలో వాటర్ సప్లయ్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, పరమేశ్వర్, జనార్దన్, శ్రీనివాస్, శ్రీశైలం, మల్లేశం పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

బడ్జెట్‌లో విద్యకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

● ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆలిండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్(ఏఐఎస్‌టీఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని చిన్నచూపు చూడడం మానవ వనరులను తగ్గించడమే అవుతున్నదన్నారు. ఎస్టీయూ సంఘం పోరాటాల ఫలితంగా ఉపాధ్యాయుల సౌకర్యాలు కల్పించబడ్డాయన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఆర్థిక పరమైన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, బడుల్లో స్కావెంజర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు పర్వతరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాథోడ్, ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, నాయకులు బ్రహ్మచారి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు

జహీరాబాద్, ఫిబ్రవరి 5: రైతులు కూరగాయల సాగు సమయంలో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ విస్తీర్ణాధికారి ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని చిన్నహైదరాబాద్ గ్రామంలో రైతులకు పంటలు, కూరగాయల సాగు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంతంలో రైతులు ఎక్కువగా ఆరుతడి పంటలను వేస్తారన్నారు. పంటలను వేస్తే సరిపోదని సకాలంలో రసాయన మందులు, తదితరాలను పిచికారీ చేస్తూ పంటలను క్రిమికీటకాలు ఆశించకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రైతుల అనుభవాలు, పంటపొలాల సందర్శనతో తాము కొత్త పద్ధతులను నేర్చుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు శివాని, సౌమ్య, శ్రీజారావు, సంతోషినిరెడ్డి, రక్షిత, వైష్ణవి, శ్రీనిధి, సుప్రియ, సంధ్యమతి, ఉషశ్రీ, సాహితీ, రైతులు పాల్గొన్నారు.



చిన్నహైదరాబాద్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి

● ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం

వెల్దుర్తి, ఫిబ్రవరి 5: ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల కష్టాలు తీరడం లేదన్నారు. గత ప్రభుత్వం సకాలంలో జీతం ఇవ్వకపోవడం, పీఆర్సీ ఏరియర్స్ బకాయిలు విడుదల చేయకపోవడం, జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, సరెండర్‌లీవ్, మెడికల్ బిల్లులు లాంటివి ఎన్నో ఆర్థికపరమైన బిల్లులను పెండింగ్‌లో పెట్టి ఉద్యోగులను, ఉపాధ్యాయులను ఆర్థికంగా దెబ్బతీసిందన్నారు.

భూ నిర్వాసితులతో అధికారుల సమావేశం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంధ్య, అధికారులు

హత్నూర, ఫిబ్రవరి 5: హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామం మీదుగా వేయనున్న ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితులతో రెవెన్యూ అధికారులు సోమవారం సమావేశమయ్యారు. ఆ భూముల్లో ఉన్న బోరుబావులు, పైపులైన్లు, చెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాసాల గ్రామ శివారులో 60 ఎకరాల 11 గుంటల భూమి ట్రిబుల్ ఆర్ కోసం సేకరించినట్లు తహసీల్దార్ సంధ్య తెలిపారు. రైతుల ద్వారా క్షేత్రస్థాయిలో తెలుసుకున్న వివరాలను రికార్డు చేసి జిల్లా అధికారులకు పంపనున్నట్లు రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రామనాథం తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సురేందర్‌గౌడ్

హత్నూర, ఫిబ్రవరి 5: హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామ శివారులో గల సర్వేనెంబరు 336లో భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సురేందర్‌గౌడ్ సోమవారం కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత 30 ఏళ్ల నుంచి కాస్తులో ఉండి బోరువేసి పంటలు సాగుచేస్తున్న భూమిలోకి కొందరు ఆక్రమణకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలు మార్లు మండల అధికారులకు ఫిర్యాదు చేసినా.. లెక్కచేయకపోవడంతో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో 'ఖేలో భారత్- ఖేలో' క్రీడలు



క్రీడలు ప్రారంభిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, హోప్ ఆస్పత్రి ఎండీ కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5: ఏబీవీపీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 'ఖేలో భారత్- ఖేలో' పేరిట క్రీడలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డా.జానారెడ్డి, హోప్ ఆస్పత్రి ఎండీ డా.కృష్ణమూర్తి క్రీడలు ప్రారంభించి మాట్లాడారు. వివేకానంద, సుభాష్‌చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. 8 తేదీవరకు క్రీడలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లవన్‌కుమార్, మెదక్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, జిల్లా ప్రముఖ్ మాధవరెడ్డి, ఎస్ఎఫ్‌డి తెలంగాణ ప్రాంత కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా కన్వీనర్ ఆకాశ్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పాలకవర్గానికి సన్మానం



చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో మాజీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్థులు

నాగల్‌గిద్ద/చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5: గ్రామాల్లో ఐదేళ్లపాటు సేవలందించిన మండల పరిధిలోని ఇరక్‌పల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులను గ్రామస్థులు సోమవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్ విఠల్‌రావు, వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు. పదవిలో లేకున్నా ప్రజలకు సేవలందిస్తానని సర్పంచ్ మంగాదేవియాదారావు అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామ పాలకవర్గాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు సన్మానించారు.

డిజిటల్ మార్కెటింగ్ విధానంతో ఉపాధి అవకాశాలు



ప్రొఫెసర్ ఎం.ఏ.అజీమ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

జహీరాబాద్, ఫిబ్రవరి 5: డిజిటల్ మార్కెటింగ్ విధానంతో యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తామని మౌలానా అబ్దుల్‌కలాం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎం.ఏ.అజీమ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'కామర్స్ సెమినార్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మార్కెటింగ్ తదితరాలు ఇంటర్నెట్ వ్యవస్థపై ఆధాపడి కొనసాగుతున్నాయన్నారు. అందులో భాగంగా డిజిటల్ ప్లాట్‌ఫాంలైన సోషల్‌మీడియా, యూట్యూబ్, ఈ-మెయిల్, వెబ్‌సైట్ల ద్వారా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. ఇందులో నైపుణ్యం గలిగిన యువతకు స్వయం ఉపాధి పథకంలో భాగంగా మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పాపన్నపేట, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని కొత్తలింగాయపల్లిలో ఇటీవల జాతీయ జెండా ఎగుర వేయవద్దని కులం పేరుతో దళిత యువకులను దూషించిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ప్రివెన్షన్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు పాతూరి రాజు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తలింగాయిపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ దళిత యువకులను జెండా ఎగుర వేయొద్దని కులం పేరుతో దూషించిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఇందులో ఎమ్మార్పీఎస్ నాయకులు సామేల్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

ఖురాన్ చదివిన విద్యార్థులకు సన్మానం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5: నారాయణఖేడ్ మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో దివ్యఖురాన్ పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, దివ్యఖురాన్‌ను పఠించిన పలువురు విద్యార్థులకు ఖురాన్ గ్రంథాలను అందించి సన్మానించారు. ప్రిన్సిపల్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్ దారం శంకర్, మైనార్టీ వెల్ఫేర్ కమిటీ బాధ్యులు తాహేర్‌అలీ, మౌసోద్దీన్, సుబుర్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రవక్త చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలి'

నిజాంపేట, ఫిబ్రవరి 5: ప్రవక్త ఇచ్చిన శాంతి సందేశాలు సమాజంలో ఉండాలంటే ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ముఫ్తీ షహీద్ అక్బర్ సాబ్ అన్నారు. మండల కేంద్రంలోని దారుల్ ఉలుమ్ అలీ మియా స్థాపకుడు అన్వర్ సహబ్ ఆధ్వర్యంలో సోమవారం మసీదు దగ్గర సమావేశం నిర్వహించారు. ముందుగా మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నబువత్ ఆధ్వర్యంలో శాంతి సందేశం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ముస్లిం మత పెద్దలు ముఫ్తీ అబూబకర్ జాబీర్ ఖాసీం సాబ్, ముస్లిం మైనార్టీలు అబ్దుల్ అజీజ్, హఫీజ్, ఫాహిమొద్దీన్, హఫీజ్ ముజహిద్, హఫీజ్ షర్ఫుద్దీన్, మౌలానా అహమ్మద్, అబ్దుల్ వాజిద్, మహమ్మదర్ తల్హా, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శుల నియామకం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5: బీజేపీ మెదక్ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శులను జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ప్రకటించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మీనరసింహరెడ్డి, చిమ్మనమైన శ్రీనివాస్, రాజేందర్‌ను నియమించినట్లు వివరించారు.

మాల మహానాడు ఆఫ్ ఇండియా మండలాధ్యక్షుడిగా గోపాల్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5: మాల మహానాడు చిన్నశంకరంపేట మండలాధ్యక్షుడిగా జంగరాయి గ్రామానికి చెందిన గడ్డం గోపాల్ సోమవారం నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షుడు నంది సురేష్ ఏకగ్రీంగా నియమించినట్లు గోపాల్ తెలిపారు. మాలల హక్కుల కోసం పోరాడుతామన్నారు. అధ్యక్ష పదవికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు స్వామి, ధన్‌రాజు, నాగరాజు, వెల్దుర్తి మండలాధ్యక్షుడు రమేష్, ప్రవీణ్, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను తెరిపించాలి: సీపీఎం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మూసివేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిపించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి అతిమాల మాణిక్యం కోరారు. సోమవారం ఖేడ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 3 లక్షల 55 వేల 802 ఎకరాల్లో పత్తిని సాగుచేశారని, దీంతో 3 లక్షల 55 వేల 802 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని, అయినా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో లక్ష 10 వేల 674 మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారని, ప్రభుత్వ కేంద్రాల కంటే ప్రైవేటు వ్యాపారులే అధికంగా కొనుగోలు చేశారని, సీసీఐ కొనుగోలు కేంద్రాలు మూసివేయడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారని, అందువల్ల రైతులకు నష్టం జరగకుండా కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిపించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు నర్సింహులు, కాన్షీరాం, సంతోష్, మోశప్ప, అరుణ్, రమేష్ పాల్గొన్నారు.



ఖేడ్‌లో మాట్లాడుతున్న సీపీఎం ఏరియా కార్యదర్శి మాణిక్యం

సంత్‌శ్రీ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించండి

● ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాన్ సుబాన్‌సింగ్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 5: సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాన్ సుబాన్‌సింగ్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొండ, కోనల్లో అనాగరికంగా జీవిస్తున్న బంజారాలను ఆధ్యాత్మిక, విజ్ఞాన పరమైన పరిజ్ఞానం సాధించేలా సేవాలాల్ మహరాజ్ కృషి చేశారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిందని, కానీ సెలవుదినంగా ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవుదినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.